

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# శీను – సితాను(మే 1 విడుదల)

ఈ దిక్కుమాలిన నాలిక పూత కాదు గానీ మరీ పెంట పెట్టేస్తోంది. ఓ పెహరట్టు రుచి తెలీటల్లేదు, ఓ చిట్టిగారె తిన్నా జిల్లు మంటల్లేదు, దీన్ని తగలెయ్య. పోనీ కొట్టుమీకెళ్ళి ఏదన్నా మందడిగి తెచ్చుకుందామంటే, ఈ సంకటాన్ని ఇంగ్లీషులో ఏవంటారో శీనిగాడికి తెలిసి చావదు.

అంచేత సివరాకరికి సిరాకెత్తి, ఫేసు బుక్కులో స్టేటస్ మెసేజెట్టాడు **" టంగ్ ఫ్లవరింగ్, వాట్ డూయింగ్?"** అని.

నెల తక్కువ్వెధవలు నలుగురు ఫ్రెండు గాళ్ళు దానికి వెంఠనే లైక్ కొట్టేసారు.

ఆనక ఓ గెంటాగి రాసారు **"అబద్ధాలాడడం మానేయ్, ఆటోమేటిగ్గా తగ్గిపోద్ది"** అని.

కరెష్టే, చిన్నప్పుడు సోంపండు తాతగారు కూడా చెప్పేవారు **"వెధవల్లాలా, అబద్ధాలాడితే నాలిక పూస్తుంది"** అని.

నిజవే నేమో, కానీ అబద్ధవాడకుండా అరనిమిషం కూడా గడవదే, ఎల్లగరా భవంతుడా.. అని వగస్తూ, పైపళ్ళు తోమి, కింద పళ్ళు ఇప్పుడు తోవడవా, ఆదివారానికి ఆట్టేపెట్టడవా అని ఆలోచిస్తూ, మొత్తానికి పూర్తిచేసి, తల దువ్వుకుని, వెనక్కి తిరిగి నడిచి, గిరుక్కుని మళ్ళీ అటు తిరిగి అద్దంలో చూసుకుని

**"హీరో, అంతే, యా, అయాం బాబు గారు హీరో."** అనుకుంటున్నాడు శీనివాసు.

**"హీరో..నా? ఏ సినిమా అమ్మా? సినిమా పేరు "కాటి కాపరా?" ఆ రోల్ కి సరిగ్గా సూటవుతావు, భుజం మీద ఒక కుండా, నీ బొజ్జ ఇంకో కుండా, ఇహిహి...కిచ కిచ..."** అని వినిపించింది.

చుట్టూ చూసాడు. ఎవరూ కనపడలేదు. బిక్క చచ్చి పోయాడు శీను. కాసేపటికి ధైర్యం తెచ్చుకుని

**" నువ్వు ఎక్కడున్నా సరే, వెంటనే బైటికొచ్చి కనిపించు, నాకేం భయం లేదు.."** అన్నాడు పీల గొంతుతో.

**"భయం నీకు కాదు, నాకురా, కుంకా. ముందో చొక్కా తగిలించు, కనీసం తువ్వాలన్నా కప్పుకో, చస్తున్నాం నీ ఎక్స్పోజింగు చూడలేక"** అని వినిపించింది.

**"ఓ, సారీ "** అని గబ గబా స్నానం కానిచ్చేసి డ్రెస్సేసుకుని వచ్చి **"ఇప్పుడు కనిపించు మర్యాదగా.."** అన్నాడు, అదే పీల గొంతుతో.

వెంఠనే రాజన్ నాగేంద్ర ఇచ్చే బేక్గ్రౌండ్ మ్యూజిక్ వినబడింది. అద్దంలో అచ్చం శీనిగాడిలాంటి ఆకారం కుడి మూలన కనిపించింది, తోక భుజం మీద వేసుకుని నవ్వుతూ.

**“ఎవరు నువ్వు?”** అడిగాడు శీను.

**“యేం, రాజాధి రాజు చూళ్ళేదా? బాపు గారి సినిమా ఎలా మిస్సయ్యావు? మొదటినించీ చెప్పాలంటే నాకు చిరాకు..”** అంది చిరాగ్గా.

**“అంటే, నువ్వు సైతానువా..”** అన్నాడు శీను అనుమానంగా.

**“యేం, డౌటా? కాపోతే నేను సైతాను కాదు సితాను ని. అంటే నీకు మేలు చేసే జీవాన్ని. నాలిక పూత పోగొట్టడానికొచ్చాను. నీచేత రెండ్రోజులు నిజాలు చెప్పిస్తాను. నీ పూత పోగానే, నేనూ పోతాను. సరేనా?”** అంది తోక నోట్లో పెట్టుకుంటూ.

**“అజ్జి బాబోయ్, రెండ్రోజులే, నిజం చెబితే రెండంటే రెండు నిమిషాలు కూడా బతకనివ్వరు తెలుసా?”** అన్నాడు శీను ఆందోళనగా.

**“మరేం పర్లేదు. నేనున్నాను. ఫద, ట్రై చెయ్యి...”** అంటూ ఎంకరేజ్ చేసాడు సితాను గాడు. బిక్కు బిక్కు మంటూ మెట్లు దిగి కిందకొచ్చాడు శీను. వాళ్ళావిడ అద్దం ముందు నించుని

**“హిమగిరి సొగసులూ..ఊ..ఊ..”** అంటూ దారుణంగా ఖూని రాగం తీస్తోంది. వెనకగా వెళ్ళి శీను ఆవిడ భుజాల మీద చేతులేసి అద్దంలోకి చూస్తూ ఎన్.టీ.యార్ లాగ

**‘ఆపు శాంతా, పాడావేం?”** అన్నాడు గోముగా.

ఆవిడకి వళ్ళు మండి ఒక్క మొట్టికాయిచ్చింది.

గబుక్కున వెనక్కి జరిగి **“ఏటిదీ, పెద్దా చిన్నా లేకుండా..”** అన్నాడు బుంగమూతెట్టి బుర్ర తడువుకుంటూ.

**“లేకపోతే, నేను పాడుతూంటే ఆపమంటారా? నా పాట బాలేదా?”** అంది ఆవిడ. లోపలనించి సితాను గెంతులేస్తున్నాడు

**“నిజం చెప్పు నిజం చెప్పు”** అని. తప్పు లేదు శీనిగాడికి.

**“దేవుడు గొంతిచ్చింది మాట్లాడడానికి. పెతీవోణ్ణీ పాడెయ్యమని కాదు. నీకంతగా పాడలనుంటే, మన తెలుగు అసోసియేషన్ ప్రోగ్రాముల్లో పాడుకో. అక్కడైతే, నోరుంటే పాడేయచ్చు. ఒక్క పీనుగ నోరెత్తి అడ్డు చెప్పదు. చెబితే తన చాన్సు పోతుందని భయం. భోజనాలు చివర్లో పెడతారు కాబట్టి, ఒక్క శాల్తీ కూడా కుర్చీల్లోంచి కదలకుండా వింటారు, చప్పట్లు కూడా కొడతారే..”** అన్నాడు ఉపాయం చెబుతూ.

**"మీకు అసూయ. మేమంతా బాగా పాడతావని కుళ్ళు.."** అనేసి బుగ్గ గిల్లేసి ఆఫీసుకి పోడానికి రెడీ అవ్వడం మొదలెట్టిందావిడ.

**"చూసావా, నిజం చెబితే ఆల్రెడీ మొట్టికాయలూ, బుగ్గ కందుళ్ళూ.."** అన్నాడు శీను సితానుతో.

**"పర్లేదు, చూడు ఆల్రెడీ నీ నాలిక మీంచి నాలుగు పువ్వులు మాయాం. పద, పద, అఫీసుకెళదాం.."** అంటూ ఎగురుకుంటూ వచ్చి కారెక్కేసింది సితాను.

**"ఇవాళ నువ్వు నా కొంప ముంచేట్టున్నావు"** అనుకుంటూ కారు డోరెయ్యబోతుంటే గుమ్మంలోకొచ్చి అడిగింది వాళ్ళావిడ

**"ఏవండీ, ఈడ్రెస్సు బావుందా, పొట్టయ్యిందా?"** అని.

**"డ్రెస్సు...నువ్వు కొన్నప్పుడెలా ఉందో అలాగే వుందన్నమాట.."** అనేసి కారు రివర్సు చేసి గరాజ్ డోరేసేసి పారిపోయాడు శీను.

ఆవిడ విసిరిన చెప్పు గెరాజు డోరు కి తగిలి లోపలే పడి పోయింది. నాలికమీంచి ఇంకో రెండు పువ్వులెగిరిపోయాయి. ఆఫీసుకి ఆలీసం అవుతోందని రేసు గుర్రంలా పరిగెట్టిస్తున్నాడు కారు. నాలుగు వీధులు నాలుగు సెకన్లలో దాటేసాడు. అయిదో వీధిలో దొరికిపోయాడు. పోలీసాడు ఆపి అడిగాడు

**"నువ్వు స్పీడ్ లిమిట్ కన్నా 20 ఎక్కువ వెడుతున్నావు తెలుసా?".**

**"నిజం చెప్పు, నిజం చెప్పు"** అంటూ గెంతులేస్తున్నాడు సితాను గాడు.

విధిలేక నిజం కక్కేసాడు శీను. **"తెలుసెహె. ఓరి ఎర్రినా ఏరుసెనక్కాయీ, రెండు రోడ్లకి ఎనక నేను 35 స్పీడ్ లిమిట్లో 85 కొట్టేను తెలుసా? సర్లే టిక్కెట్టెంతో చెప్పు"** అని.

పోలీసాడు నిజంగా కన్ ఫ్యూజ్ అయిపోయి శీనుగాణ్ణి కిందకి దింపి బ్రెత్ ఎనలైజర్ పెట్టాడు. అది కాస్తా ధామ్మని పగిలిపోయింది. అటూ ఇటూ నడవమన్నాడు. శోభన్ బాబు లెవెల్లో నడిచి చూపించాడు శీను

**"కుడి కాలు పెట్టగానె కుర్రాణ్ణి, ఎడం కాలు పెట్టగానె ఎర్రోణ్ణి "**అని పాడుకుంటూ.

పోలీసాడికి అర్థం కాలేదు. వాసన తట్టుకోలేక ముక్కు మూసుకుని అడిగాడు

**" నువ్వు మందుకొట్టలేదని తెలుసుతోంది. మరి ఈ వాసన ఏంటి?"** అని.

మళ్ళీ నిజం చెప్పేశాడు శీను.

**"అంటే, ఎ గార్లిక్ ఎ డే కీప్స్ ఎవ్విరీ వన్ అవే.."** అని.

వాడు టిక్కెట్టు సంగతి కూడా మర్చిపోయి పారిపోయాడు. బతుకు జీవుడా అని కారెక్కి ఆఫీసుకి చేరాడు శీను.

**"వొరేయ్ సితానుగా, నీకో అగరత్తెలిగించి, పావలా బిళ్ళ ఇస్తానుగానీ, నాలిక పూత తగ్గడానికి ఇంకేవైనా ఆల్టర్నేట్ ఉపాయం చెప్పురా, ఈ నిజాలు చెప్పి చెప్పి పీకల మీదకి తెచ్చుకునేట్టున్నాన్రా.."** అన్నాడు శీను పార్కింగ్ లాట్ లో నడుస్తూ.

**"హుమ్..నువ్వు నిజాలు చెప్పందే పూత తగ్గదు శిశువా. పోనీ ఓ పంజెయ్యి. నువ్వు అబద్ధం చెప్పిన వెంటనే, ఇన్నర్ వాయిస్ వాడి, నిజం నాతో చెప్పేయ్, నేను మార్కులేసేసుకుంటాను."** అన్నాడు సితాను.

**"హమ్మయ్య, బతికించావురా గురువా.."** అని ఫ్రెంట్ డెస్క్ దగ్గరకొచ్చాడు.

అక్కడ కూర్చున్న డకోటా బస్తా, తెల్లాణ్ణి చూసి, **"ఎలా వున్నావు? నీ టై ఎంత బావుందో? ఎక్కడ కొన్నావు? నిన్న రాత్రి ఏం తిన్నావు? హేవ్ ఎ నైస్ డే"** అని ఊ తెగ కులుకు పోయింది.

వాడు **"ఫైన్ ఫైన్"** అనుకుంటూ ఆఫీసులోకి పోయాడు.

**"రిసెప్షనిస్ట్ అంటే ఇల్లా వుండాలి"** అని మురిసిపోతూ ఎంటరయ్యాడు శీను.

ఆవిడ వీణ్ణి తలెత్తైనా చూడకుండా కంప్యూటర్లో పేకాడుకోడం మొదలెట్టింది.

కాసేపాగి **"నాకు నాలిక పూసింది తెలుసా?"** అన్నాడు తెలుగులో.

ఆవిడ తలెత్తి **"వాట్, యు ఆర్ ఆల్వేస్ లేట్, వై సో ఎర్లీ టుడే"** అనేసి మళ్ళీ స్క్రీన్లో తలపెట్టేసింది.

వళ్ళు మండింది శీనుగాడికి. **"తెల్లాడికేమో అన్ని కుశలప్రశ్నలా, నాకేమో కుళ్ళు ప్రశ్నలా, అసలు నిన్ను పనిలో ఎందుకే పెట్టుకున్నది, పేకాడుకోడానికా? ఆణ్ణి చూస్తే మొఖం యీరభద్రపళ్ళెవంత ఐపోయింది, నన్ను చూస్తే పేడ తిన్నట్టు పెడతావేమే మొహం, ముదనష్టపు పిశాచవా"** అని ఇన్నర్ వాయిస్ లో అనుకుని, పైకి మాత్రం **"యా, యూటూ హేవ్ అ నైస్ డే.."** అనేసి లోపలికెళిపోయాడు. సితాను మార్కులేసుకుంటున్నాడు.

కాసేపయ్యాకా బాసాసురుడు పిలిచి ఫ్రెష్ గడ్డి కోసి పెట్టాడు.

**"ప్రతి టాస్కూ లేటే.అసలు రిపోర్టులే రాయవు ఇలాగైతే చాలా కష్టం.."** అంటూ.

**"నీ టాస్కు కోతులెత్తుకెళ్ళ , నువ్విచ్చే డబ్బుకి నేను ఆఫీసుకి రావడమే ఎక్కువ, ఆపైన అడపాదడపా కోడింగ్ కూడా చేస్తున్నానా? ఈ శవ జాగారానికి సాయం ఇంకా రిపోర్టు రాయాల్రా నీకు ? నేను చేరి పదేళ్ళైతే, కనీసం రెండ్రూపాయలైనా పెంచావురా జీతం? నీకన్నా అహనా పెళ్ళంటలో కోట శ్రీనివాసరావు నయం, పీనాసి కుక్షీ, పింజారీ పక్షీ..మూసేయ్, మూసేయ్యంతే..."** అని లోపల అనుకుని, పైకి **"ఎస్సార్, అసలు నన్నడిగితే ప్రతీ టాస్క్ కీ నాలుగు రిపోర్టులు రాయాలిసార్, నేను ఖచ్చితంగా ఇంప్రూవ్ అవుతాను సార్, అంటే యెస్సార్"** అనేసి వచ్చి ఊసురంటూ సీట్లో కూలబడి, నాలుగయ్యేసరికల్లా బయల్దేరి ఇంటికొచ్చేసాడు.

సాయంత్రం వాళ్ళావిడ బలవంతం మీద వాళ్ళ తెలుగు అసోసియేషను సాంస్కృతిక్క కార్యక్రమానికెళ్ళాడు. నాలిక పూత మూడొంతులు తగ్గిపోయింది. సితాను గాడు శాయశక్తులా సహాయం చేస్తున్నాడు పాపం. జ్యోతి ప్రజ్వలన, వినాయకుడి మీద

పద్యం, పాట అయ్యాకా మొదలైన పిచ్చి గెంతులు, కేకలు, బూతు పాటలకు చిందులూ, నాటు మాటలూ, పూర్తయ్యాకా అనుకోకుండా శీనుని స్టేజిమీదకి పిలిచేసి

**"ఊరిలో చాన్నాళ్ళు గ ఉంటున్న శ్రీనివాస్ గారిని అడుగుదం. మా ఫోగ్రాంలు ఎట్టునాయండీ?"** అందో ఏంకరమ్మ.

**"అమ్మా, అంటే టూ మచ్చుమ్మా. అసలు నేను పుట్టు బుద్ధెరిగి, ఇల్లాంటి ఫోగ్రాములు చూడలేదండి. మీరంతా కూడా కడ దాకా వుండి ఎంజాయ్ చేసి, బోంచేసి వెళ్ళండి"** అనేసి దిగిపోయాడు.

లోపలనించి సితాను పోరు పెట్టేస్తున్నాడు **"ఇన్నర్ వాయిస్..ఇన్నర్ వాయిస్"** అంటూ.

**"వొదిలేయ్ బాసూ, ఓపికలేదు. ఏవూరెళ్ళినా ఇల్లాగే తగలడ్డాయి సంఘాలు, ప్రోగ్రాములు. ఎవణ్ణని ఏం లాభం? మంచి ప్రోగ్రాములెడితే నాతో కలిపి ఇద్దరొస్తారు చూడ్డానికి. మైకు కనిపిస్తే చాలు పాడెయ్యడం, స్టేజి కనిపిస్తే గెంతేయడం. ఇదో సంస్కృతీ, దీన్ని కాపాడ్డానికి ఇన్ని సంఘాలూ, రోతెత్తిపోతోంది.."** అన్నాడు శీను బాధపడుతూ.

ఇంక ఉండలేక పెళ్ళంతో సహా బైటికొచ్చేసాడు. అతని నాలిక పూత ఆల్మోస్ట్ తగ్గి పోయింది. హాల్లో కురస బట్టలేసుకున్న ఓ నడివయస్సు నంగిరి మొహం కనబడి **"హాయ్ అంకుల్, బావున్నారా..."** అంది వగలు పోతూ.

ఇంక తట్టుకోలేకపోయాడు శీను. ఆవిడ బుగ్గలు గిల్లేసి **"హాయ్ బేబీ, ఎలా వున్నావు, లుక్ ఎట్ యూ, యు ఆర్ ఆల్ గ్రోన్ అప్ "** అనేసి ఎత్తుకోబోయాడు. ఆవిడ జడుసుకుని పారిపోయింది.

**"లేకపోతే నాదగ్గిరా నీ జంపింగులు, నీకు సరైన రుతువులో పెళ్ళి చేసుంటే, ఈ పాటికి నాలాటోళ్ళని నలుగుర్ని కనుందువు, నీకు నేను అంకుల్నా, దున్నపోతా.."** అనుకున్నాడు ఇన్నర్ వాయిస్లో. ఫుల్ మార్కులేసేసాడు సితాను.

**"ఈవిడకో ముప్పైఅయిదన్నా వుండవూ? ఆ తిప్పుకోవడం ఏవిటండీ సిగ్గులేకుండాను.."** అంది పెళ్ళం.

**"అయితే అయింది గానీ, కత్తిలాంటి మాటన్నావే పెళ్ళావా.."** అంటూ కారు దగ్గరికి బయల్దేరాడు శీను.

నాలికమీద పూలన్నీ ఎగిరిపోయాయి. సితాను బుద్ధిగా శీనులో కలిసిపోయాడు.

COMMENTS